## క్లుప్తంగా

### రైతుబజార్ ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా 33, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్, 23, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 35, ఆలు 21, ఉల్లి 14, గోకర 40, దోస 15, సొర 13, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 65, అర్వి 35, మునగ 65, చిలగడదుంప 40, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 60. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### ఎన్నికల నిర్వహణకు అడహక్ కమిటీ ఏర్పాటు

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ కోసం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకొనేందుకు అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు కాలనీ నివాసుల సభ్యత్వాన్ని పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించనున్నారు. సభ్యత్వం తీసుకోదలచిన వారు ఫోన్ నం. 9399396222, 9177608134 సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

### నేడు యాకుత్‌పురా నియోజకవర్గ బీజేపీ మోర్చాల సమ్మేళనం

సైదాబాద్: యాకుత్‌పురా నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, పార్టీకి చెందిన అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తల సంయుక్త సమ్మేళనం బుధవారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ తెలిపారు. మంగళవారం ఐఎస్‌సదన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్లమెంట్ ప్రవాసీ యోజనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు భారతీబెన్ షియాల్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### డాక్టర్ విజయకుమార్‌కు భారత గౌరవ రత్నశ్రీ అవార్డు

వనస్థలిపురం: అహిందీ ప్రాంతంలో హిందీని ప్రచారం చేసినందుకు, సమాజ సేవకు గానూ తెలంగాణకు చెందిన వనస్థలిపురం నివాసి డాక్టర్ గుండాల విజయకుమార్‌కు భారత గౌరవ రత్నశ్రీ, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ అవార్డు, వరల్డ్ పీస్ అంబాసిడర్ అవార్డును అందజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధాన కార్యక్రమంలో విజయకుమార్‌కు అవార్డులను ప్రదానం చేశారు. కాగా విజయకుమార్ హిందీ సాహిత్యంలో చేసిన రచనలు, సేవలకు గాను ఇప్పటికే పలు అవార్డులు, రికార్డులు సొంతం చేసుకున్నారు.

### సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయండి

- మీర్‌పేట కమిషనర్ నాగేశ్వర్

మీర్‌పేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిళా గ్రూపు సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ కోరారు. విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లోని మెప్మా ఆర్‌పీ (రిసోర్స్ పర్సన్స్)లతో మంగళవారం కమిషనర్ సమావేశమయ్యారు. ఈనెల 8వ తేదీన చెరువుల పండుగ సందర్భంగా చందన చెరువు, మంత్రాల చెరువుల వద్ద బతుకమ్మ, బోనాల ఊరేగింపు, రంగోళి పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. మహిళా గ్రూపు సభ్యులందరూ పాల్గొనాలని సూచించారు. మేనేజర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ గెలిస్తేనే అన్ని వర్గాలకు న్యాయం

- అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గాన్ని మంత్రి సబితారెడ్డి కబంద హస్తాల నుంచి విముక్తి చేసిన రోజే స్థానికులకు కొలువులు, కాలనీవాసుల గోసలు, పల్లెవాసుల తిప్పలు తీరుతాయని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో పలు కాలనీవాసులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే మౌలిక వసతులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని కోరారు. జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలను కాలనీవాసులకు వివరించారు. బీజేపీ గెలిస్తే అన్ని వర్గాలకు, అన్ని రంగాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లీకేజీ.. జర దేఖోజీ!

- తాగునీరు రోడ్డు పాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



అక్బర్‌బాగ్ ఎస్‌బీఐ ఏటీఎం సమీపంలో ఇదీ పరిస్థితి

మలక్‌పేట: అక్బర్‌బాగ్, మూసారంబాగ్ డివిజన్లలో లీకేజీలతో తాగునీరు రోడ్డు పాలవుతోంది. తాగునీటి వృథాను అరికట్టడంలో వాటర్ వర్క్స్ అధికారులు విఫలమవుతున్నారు. మ్యాన్‌హోళ్ల వద్ద వాల్వ్ లీకేజీ, పైప్‌లైన్ పగిలి గంటల తరబడి మంచినీరు రోడ్లపై ఏరులా పారుతున్నా వారిలో ఎలాంటి చలనం కన్పించడం లేదు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ వర్క్స్ అస్మాన్‌ఘడ్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితి ఇదీ.

- కాలనీల్లో ఎక్కడ చూసినా లీకేజీలే దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేనికారణంగా వేలకొద్దీ గ్యాలన్ల నీరు వృథా అవుతోంది.
- ఒకవైపు లోప్రెషర్, మరోవైపు కలుషిత నీటి సరఫరాతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఖాళీగా ఉన్న మలక్‌పేట క్వార్టర్‌లో కొన్నింటిలో నల్లాలకు మూతలు ఊడి, సంపు నిండి తాగునీరు వరదలై పారుతోంది.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి వృథాను అరికట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మలక్‌పేట గవర్నమెంట్ క్వార్టర్స్‌లో..

**లీకేజీలు ఇక్కడ...**

- మలక్‌పేట ఉన్నత పాఠశాల సమీపంలో..
- బాలిక జూనియర్ కాలేజీ చౌరస్తాలో వాల్వ్ లీకేజీ
- గవర్నమెంట్ క్వార్టర్స్‌లో..
- అక్బర్‌బాగ్ ఎస్‌బీఐ ఏటీఎం సమీపంలో..

**నీటి వృథాను అరికట్టాలి**



తాగునీటి వృథా అరికట్టడానికి అధికారులు తగిన శ్రద్ధ తీసుకోవాలి. రోజుల తరబడి రోడ్లపై నీరు కాలువ మాదిరిగా రోడ్లపై ప్రవాహిస్తోంది. ఓ వైపు తాగునీరు..మరోవైపు మురుగు రోడ్లపై పారుతోంది. ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు పని తీరు మార్చుకోవాలి. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి.

– మండల బర్నబాస్, అక్బర్‌బాగ్

## తెలంగాణ పారిశ్రామిక ప్రగతి దేశానికే ఆదర్శం

**ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**



పారిశ్రామిక ప్రగతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో మంగళవారం పారిశ్రామిక ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో దేశంలోని పారిశ్రామికవేత్తలు తెలంగాణ వైపు చూస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ ప్రవేశపెట్టిన టీఎస్-ఐపాస్ విధానంతో కంపెనీలకు 36 శాఖల అనుమతులు కేవలం 30 రోజుల్లోనే లభిస్తున్నాయన్నారు. పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్, నీటి సరఫరాతో పాటు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న పటిష్ట చర్యలతో తెలంగాణకు కొత్త పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఆటోనగర్ పారిశ్రామికవాడలో రోడ్లు దెబ్బతిన్నాయని, కొత్త రోడ్లు వేయాలని ఎండీ వెంకట నర్సింహారెడ్డికి సూచించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐలా ప్రాజెక్టు ఇంజినీర్ భరత్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణ, అజయ్‌పాల్, ప్రసన్న, బీఆర్‌ఎస్ నాయకులు ఓరుగంటి వెంకటేశం, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, బీజేపీ నేతలు హరీశ్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, ఆటోనగర్‌లోని వివిధ అసోసియేషన్ల నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా శృంగేరి శంకరమఠం వార్షికోత్సవాలు



ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: అల్కాపురిలోని శ్రీ శృంగేరి శంకర మఠం షోడశ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఆలయంలో శ్రీశారదాంబ అమ్మవారికి విశేష పుష్పాలంకరణ సేవ, మహాలక్ష్మీ అలంకరణ, శారదా చంద్రమౌళీశ్వరి స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. ఉదయం శారదాంబకు విశేష పూజలు, అష్టోత్తర శతకలశాభిషేకం (108) మహా సరస్వతి అలంకరణ సేవ, దేవతా హోమాలు, మహాపూర్ణాహుతి జరిపించారు. శ్రీ శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్, విశ్వనాథ శోభనాద్రి, యడపల్లి సూర్యనారాయణరావు, గౌరీ భాస్కర్, ముదిగొండ శంకర్మ వర్మ, దేవ భాస్కర్‌రెడ్డి, సూరి వ్యాస్ కుమార్, శ్రీనివాస్ బంగారయ్య శర్మ, నరసింహమూర్తి, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయండి: ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అభివృద్ధి పనులపై నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ అధికారులతో పంజేషాహలోని కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులపై దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, డీఈఈ ప్రదీప్‌కుమార్, ఏఈలు వెంకన్న, ఎంఐఎం నేతలు షఫీయుద్దీన్, అబ్రార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ప్రియదర్శిని కాలనీవాసులతో సమావేశమైన కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ప్రతికాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధి ప్రియదర్శిని కాలనీ ఫేజ్-1లో మంగళవారం కార్పొరేటర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామన్నారు. మరో రెండు రోజుల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తామన్నారు.

కార్యక్రమంలో కాలనీవాసులు లింగస్వామి, శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నాయకులు కడారి యాదగిరియాదవ్, పారంద సాయి పాల్గొన్నారు.

## లక్ష ఓట్లతో సుధీర్‌రెడ్డిని ఓడిస్తాం: దర్పల్లి



విలేకరులతో మాట్లాడుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

హస్తినాపురం: వచ్చే ఎన్నికల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని లక్ష ఓట్లతో ఓడిస్తామని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారికంగా నిర్వహిస్తున్న విద్యుత్ ప్రగతి కార్యక్రమ సభా వేదికపై బీఆర్‌ఎస్ నేతలు ఎలా కూర్చుంటారని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే తన అనుచరులతో భౌతిక దాడి చేయించాడని ఆరోపించారు. సుధీర్‌రెడ్డి అవివేకమే ఆయన ఓటమికి కారణమవుతుందని, ఓటుతో కొడితే ఆయన మలక్‌పేటకు పారిపోవడం ఖాయమన్నారు. 23 ఏళ్లుగా ఆయన వెంట తమ్ముడిగా ఉండి పని చేశానని, తన తండ్రితో కూడా ఏనాడు దెబ్బలు తినని తనను ఎమ్మెల్యే తన అనుచరులతో కొట్టించాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ నేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, సామ రంగారెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మాజీ మంత్రిపై సుధీర్‌రెడ్డి దాడులు చేయించింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై దాడులు చేస్తే ముడుచుకుని కుర్చునే ప్రసక్తే లేదని, తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాజశేఖర్‌రెడ్డి వెంట ఉండి పని చేస్తున్నందుకు ముందస్తు ప్రణాళికతో తనపై కూడా దాడి చేశారని ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో నేతలు మల్లారపు శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, యశ్వంత్, రాజు, కరణ్, గౌస్, వినీత్, రంజిత్ ,శ్రీనాథ్, విష్ణు పాల్గొన్నారు.

## దివ్యాంగుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

హయత్‌నగర్: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న హయత్‌నగర్‌లోని షేకీనా ఫౌండేషన్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ చింతల ఇషాకర్ తెలిపారు. మానసిక వైకల్యం, ఆటిజం తదితర సమస్యలతో బాధపడుతున్న 5 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీలో నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు డాక్టర్ సర్టిఫికెట్, ఆధార్, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీలో షెకీనా ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9848156468కు కాల్ చేయాలన్నారు.

## 18న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు



యువకులతో కలిసి ఆన్‌లైన్ క్విజ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువత కోసం రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం సలీంనగర్‌లోని తన నివాసంలో 'ఆన్‌లైన్ కాంపిటేషన్ వాల్ పోస్టర్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, 16 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న యువత ఈనెల 17 తేదీలోగా తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్ పొందడానికి ఆసక్తి కలిగిన వారు 7661 899 899 సెల్ నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు. ఈనెల 18 తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. మొదటి బహుమతి ఈ-స్కూటర్, రెండో బహుమతి ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లతో పాటు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సాయిరామ్, యాదిలాల్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి



క్విజ్ పోటీల గురించి అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై కాంగ్రెస్ నాయకులు అవగాహన కలిగించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి సూచనల మేరకు ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు వెళ్లి రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తలాటి రమేష్ నేత, పెద్దవూర సైదులు, వంగాల శ్రీకాంత్ రెడ్డి, పగడాల శ్రీశైలం, శ్రీధర్, కల్యాణ్, శ్రావణ్, నగేష్, జెల్లా జగన్నాథం, మణిదీప్, సంతోష్, ప్రభు, విజయ్, మణికంఠ విప్లవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే యువతకు బంగారు భవిత: జక్కిడి



జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత

మన్సూరాబాద్: యువతకు బంగారు భవిష్యత్ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని తన కార్యాలయంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ నేతృత్వంలో సుమారు 100 మంది యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యువత నమ్మకం, విశ్వాసం కోల్పోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు విద్యావంతులు, యువకులు సరైన బుద్ధి చెబుతారన్నారు. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రమేష్‌రెడ్డి, సర్వేష్, సంపత్, రమేష్, రవి, సురేష్, నాగరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తానని మోసం

**రూ.10 లక్షలు కాజేసిన 'స్టూడెంట్' నాయకుడి అరెస్టు**



నిందితుడు కట్టా జశ్వంత్

నాగోలు: ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్ కళాశాలల్లో సీట్లు ఇప్పిస్తానని, ఫీజు తక్కువ చేయిస్తానని విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి డబ్బులు తీసుకొని మోసం చేస్తున్న ఓ వ్యక్తిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోలు, బండ్లగూడ, సాయి రాఘవేంద్రకాలనీ చెందిన కట్టా జశ్వంత్, అలియాస్ బబ్లుగౌడ్ (22) బీసీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్‌గా పని చేస్తున్నాడు. నాగోలు ప్రాంతానికి చెందిన మామిడి అమరేంద్ర కుమార్తెకు కేశవ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఎంఐటీ)లో బీఈ సీటు ఇప్పిస్తానని చెప్పి, వారి వద్ద రూ.10 లక్షలు తీసుకున్నాడు. సీటు ఇప్పించక పోవడంతో పాటు తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో అమరేంద్ర ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కట్టా జశ్వంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతడిపై గతంలో ఆదిబట్ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## కార్పొరేటర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

**రాచకొండ సీపీని కోరిన కాంగ్రెస్ నాయకులు**



రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగోలు: మన్సూరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకుడు ప్రవీణ్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకులు రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను కోరారు. కమిషనరేట్‌లో మంగళవారం ఆయనను కలిసిన కాంగ్రెస్ నాయకులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు ఎక్కువ అయ్యాయని, సొంత పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్షాలపైనా వారు దాడులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌కు తెలిపారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా.. ఎమ్మెల్యే అనుచరుల దాడులు మాత్రం ఆగడం లేదన్నారు, కొద్ది రోజులుగా ఎమ్మెల్యే వర్గీయులు చేస్తున్న దాడులను పరిశీలించి, బాధ్యులపై రౌడీషీట్ తెరవాలని కమిషనర్‌ను కోరారు. డీసీపీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ఆయన ఆఫీసులో అందుబాటులో లేరని, దీంతో ఏసీపీ శ్రీధర్ రెడ్డి ఫిర్యాదు తీసుకున్నారని చెప్పారు. విచారణ జరిపించి దాడులకు పాల్పడ్డ వారిని గుర్తించి త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామని సీపీ చౌహాన్ కాంగ్రెస్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి , జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్లు శిరీషా సోమశేఖర్ రెడ్డి, రజిత పరమేశ్వర్ రెడ్డి, విజయారెడ్డి, మిద్దెల జితేందర్, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా చెత్తకు నిప్పు..అగ్నిప్రమాదం

- భారీగా పొగ, ఎగిసిపడ్డ మంటలు
- ఆందోళనకు గురైన కాలనీవాసులు
- 3 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది



మన్సూరాబాద్ సహారాస్టేట్స్ కాలనీలో ఎగిసిపడుతున్న మంటలు

మన్సూరాబాద్: ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఓ వ్యక్తి చేసిన పని వల్ల సహారాస్టేట్స్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కాలనీ మెయింటెనెన్స్ కమిటీ సమాచారంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో కాలనీవాసులకు భారీ ముప్పు తప్పినట్టైంది. వివరాలు... మన్సూరాబాద్‌లోని సహారాస్టేట్స్ కాలనీలోని వాణిజ్య సముదాయల పక్కన సుమారు 3 వేల గజాల స్థలాన్ని ఆసుపత్రి ఏర్పాటుకు సహారా సంస్థ వద్ద సురేందర్‌రెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. దానిలో కొంత స్థలంలో సెల్లార్ పైకప్పు వరకు నిర్మించి అర్థంతరంగా వదిలివేశాడు. కొన్నేళ్లుగా ఈ స్థలం చెత్తాచెదారంతో నిండిపోయింది. రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ స్థలం తన తండ్రి సురేందర్‌రెడ్డి ఖరీదు చేశాడని, ఇప్పుడు ఆసుపత్రి నిర్మిస్తామంటూ కాలనీ మెయింటెనెన్స్ కమిటీని సంప్రదించాడు. ఆసుపత్రి నిర్మాణపు బ్లూప్రింట్, ఇతర సాక్ష్యాధారాలు తీసుకురావాలని కమిటీ అతడిని కోరింది.

- ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం 9.30కి రాజేందర్‌రెడ్డి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుండా, కాలనీ మెయింటెనెన్స్ కమిటీకి సమాచారం ఇవ్వకుండా ఆ స్థలంలో పాతటైర్లు వేసి చెత్తకు నిప్పు పెట్టాడు. క్రమంగా పొగ, మంటలు పెరిగిపోవడంతో స్థానికులు, మెయింటెనెన్స్ కమిటీ పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.
- అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు మంటలు భారీ స్థాయిలో ఎగిసిపడటంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజిన్లతో 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భారీగా పొగ కమ్ముకోవడంతో వృద్ధులు, ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఇబ్బంది పడ్డారు. రాజేందర్‌రెడ్డి అజాగ్రత్తగా చెత్తకు నిప్పు పెట్టడంతో ప్రమాదం సంభవించి సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని కాలనీ మెయింటెనెన్స్ కమిటీ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- అగ్నిప్రమాద సమాచారం తెలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. భయాందోళన చెందవద్దని, ఫైర్ సిబ్బంది మంటలు పూర్తిగా ఆరిపోయే వరకు ఇక్కడే ఉంటారని కాలనీవాసులకు వారు ధైర్యం చెప్పారు.